

'పది రోజుల క్రితం మా వద్దకు ఓ కొట్లాట కేసు వచ్చింది. ప్రాథమికంగా పరిశీలిస్తే కేసు పెట్టాల్సినంత తీవ్రత లేదు. సర్దిచెప్పి పంపించేయొచ్చు. అయితే 'ఆయన'ఫోన్ చేసి ఎలాగైనా కేసు కట్టాల్సిందే అని ఆదేశించారు. దీంతో చేసేది లేక కేసు నమోదుకు సిద్ధమవుతున్న సమయంలో 'ఈయన'ఫోన్ చేశారు. కేసు కడితే ఇబ్బంది పడతారు.. జాగ్రత్త అని హెచ్చరిస్తున్నారు. మాకు ఏం చేయాలో తెలియక కేసు పెండింగ్‌లో ఉంచితే ఉన్నతాధికారులు చీవాట్లు పెడుతున్నారు.'
- ఓ పోలీస్ అధికారి ఆవేదన ఇది



'పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని ఓ రైతు దరఖాస్తు చేసుకున్నాడు. అన్ని సక్రమంగా ఉండడంతో నిబంధనల ప్రకారం మ్యుటేషన్, ఆన్‌లైన్ చేసేందుకు సిద్ధమయ్యాం. ఈ లోపు 'ఈయన'అనుచరుడు ఫోన్ చేసి ఆ రైతు మావాడు కాదు.. ఆ భూమిని మేం కూడా పరిశీలించి 'సంతృప్తి'చెందితేనే ఆన్‌లైన్ చేయాలంటూ.. హుకుం జారీ చేశారు. దీంతో చేసేది లేక పెండింగ్‌లో పెట్టాం. సదరు రైతు 'ఆయన'వద్దకు వెళ్లి ఆన్‌లైన్ చెయ్యలేదని చెప్పడంతో మాపై మండిపడ్డారు.'
- అయోమయంలో ఓ రెవెన్యూ అధికారి



● 'అడకత్తెరలో పోకచెక్కలా'.. అధికారులు

నలిగిపోతున్నారు..!

- పెందుర్తి నియోజకవర్గంలో పంచకర్ల వర్సెస్ గండి
- ఒకే పనిని ఒకరు వద్దని.. ఇంకొకరు కావాలని!
- ఉన్నతాధికారులకు నివేదించినా ఫలితం శూన్యం

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో అడకత్తెరలో పోక చెక్క మాదిరి అధికారులు నలిగిపోతున్నారు. కూటమి ముఖ్యనాయకులు, వారి అనుచరుల ఆధిపత్య పోరు నడుమ అధికార యంత్రాంగం నలిగిపోతోంది. అధికారం చేపట్టి ఆరు నెలల సమయంలోనే ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారంటే.. ముందు ముందు ఇంకెలా ఉంటుందోనని అధికారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమిలో భాగస్వామి అయిన జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ పర్సన్ ఇన్‌చార్జి గండి బాబ్జీతో పాటు వాళ్ల అనుచరులు అధికార యంత్రాంగానికి ప్రత్యక్ష నరకం చూపిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా పరవాడలో నివాసం ఉంటున్న మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే గణబాబు వర్గం ఒత్తిళ్లు కూడా నియోజకవర్గ పరిధిలోని అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

క్షేత్రస్థాయిలోనూ ఇదే తీరు!

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న చందంగా జనసేన, టీడీపీ వర్గాలు గ్రామ/వార్డు స్థాయిలో కూడా ప్రత్యర్థులుగానే వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం లేకుండా చేస్తున్నారని ప్రజలు బాహాటంగానే ఆక్షేపిస్తున్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను ఒకరు చేస్తే, ఇంకొకరు అడ్డుకోవడం.. ప్రజా సమస్యలను పరిష్కరించకపోగా తమ ఆధిపత్య పోరుతో వాటిని మరింత జఠిలం చేస్తున్నారు. చివరికి ప్రజాక్షేత్రంలో అధికారులను నిందితులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని కూటమి నాయకులను ఎలా ఎదుర్కోవాలో తెలియని అయోమయంలో అధికారులు సతమతమవుతున్నారు. ఉన్నతాధికారులకు మొర పెట్టుకుందామని వెళ్తే.. మీ కంటే మా పరిస్థితి దారుణంగా ఉంది.. మేం ఎవరికి చెప్పుకోవాలంటూ.. వారూ వాపోతున్నారట!

అధికారులపై ఆధిపత్య పోరు

ప్రజలకు అలవిమాలిన హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు నియోజకవర్గ పరిధిలో ఎక్కడా క్షేత్రస్థాయిలో సఖ్యతగా ఉండి ప్రజలకు సేవ చేస్తున్న దాఖలాలు లేవు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే పంచకర్ల, మాజీ ఎమ్మెల్యే గండిబాబ్జీతో పాటు మాడుగుల ఎమ్మెల్యే బండారు కూడా పెందుర్తిపై పట్టుకోసం తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. అధికారం వచ్చిన తొలి రోజుల్లో మండలస్థాయి, పంచాయతీ స్థాయి అధికారుల బదిలీలు మొదలుకుని తాజాగా ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికల వరకు ఎవరికి వారు పైచేయి సాధించేందుకు పాకులాడారు. తాము సిఫార్సు చేసిన అధికారులు రాకపోవడంతో, ఆ స్థానంలో వచ్చిన అధికారులపై ఆధిపత్యం కోసం ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. బహిరంగంగానే సదరు అధికారులపై కారాలు మిరియాలు నూరుతున్నారు. 'మీ సర్ చెబితేనే చేస్తారా.. మేం చెబితే చేయరా'అంటూ నేరుగానే ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. వీరి ఆధిపత్య పోరులో ఎక్కువగా రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులే నలిగిపోతున్నారు.

క్లుప్తంగా

గవర రాజుకు అదీప్‌రాజ్ పరామర్శ



గవర రాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గవర రాజు తండ్రి గవర దేముడు బుధవారం మృతి చెందారు. దీంతో ఆయన పార్థివ దేహాన్ని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేముడు అంత్యక్రియలను స్వగ్రామం వంగలిలో నిర్వహించారు. ఈ అంత్యక్రియలలో అదీప్‌రాజ్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

23న కాలభైరవ జయంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేసుబోయిన త్రినాథ్, విశ్వసాయి గురూజీ

పెందుర్తి: మండలంలోని పెదగాడిలో ఉన్న మహా కాలభైరవ అనుగ్రహ శక్తిపీఠంలో ఈ నెల 23న కాలభైరవ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం ప్రధాన సేవకుడు విశ్వసాయి గురూజీ తెలిపారు. బుధవారం పీఠంలో సీనియర్ నాయకుడు కేసుబోయిన త్రినాథ్, గురూజీ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వసాయి గురూజీ మాట్లాడుతూ శ్రీకాళహస్తి దేవస్థాన పండితుల ఆధ్వర్యంలో మహా కాలభైరవ పాశుపత రుద్ర హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులంతా తరలి వచ్చి, విశేష పూజల్లో పాల్గొనాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పీఠం ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు వాలిమెరకలో రెవెన్యూ సదస్సు

పెందుర్తి: మండలంలోని వాలిమెరక(జుత్తాడ) గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలో భూములున్న రైతులు పాల్గొని, రెవెన్యూ పరమైన, ఇతరత్రా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించుకోవచ్చన్నారు.

దివ్యాంగులకు రగ్గుల పంపిణీ



దివ్యాంగులకు రగ్గులు అందిస్తున్న ఎన్టీపీసీ సెంట్రల్ టీం ప్రతినిధులు

పరవాడ: స్థానిక భవిత కేంద్రాన్ని ఎన్టీపీసీ సెంట్రల్ టీం ప్రతినిధులు బుధవారం సందర్శించారు. దివ్యాంగుల విద్యా ప్రమాణాలు, భవిత సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా సింహాద్రి ఎన్టీపీసీ భాగస్వామ్యంతో నిర్మించిన భవిత కేంద్రం నిర్వహణపై సెంట్రల్ టీం సంతృప్తి వ్యక్తం చేసింది. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులతో కాసేపు ముచ్చటించి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రంలోని దివ్యాంగులకు రగ్గులను అందించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సెంట్రల్ టీం ప్రతినిధులు, సీఎస్సార్ విభాగం డిప్యూటీ మేనేజర్ కె.ప్రకాశరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఎంఈవో-2 సాయిశైలజ, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగేలా వర్గీకరణ

- ఏకసభ్య కమిషన్‌కు పలు సంఘాల వినతి



విశాఖ కలెక్టరేట్‌లో రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న ఐడీ బాబు తదితరులు

సబ్బవరం: రాష్ట్ర యూనిట్‌గా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మాదిగ, దాని ఉపకులాలకు న్యాయం జరిగేలా ఏబీసీడీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ ఐడీ బాబు కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యాటనలో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను బుధవారం కలిసి, వినతి పత్రం అందించారు. మాదిగ, డప్పు, చర్మ కళాకారుల వంటి 59 ఉపకులాలకు న్యాయం జరిగేలా వర్గీకరణ చేపట్టాలన్నారు. ఆయన వెంట ఆంధ్ర మహిళ కో ఆర్డినేటర్ గొట్టిపాటి సుభాషిణి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వంగలపూడి గణేష్, అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి కండేల నరసింహారావు, అనిల్, అశోక్‌కుమార్ తదితరులున్నారు.

- ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్‌కుమార్ కలిసి రాష్ట్రంలో మాదిగల జనాభా నిష్పత్తి మేరకు వాటా దక్కేలా వర్గీకరణ చేయాలని కోరారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు కటుమూరి తాతారావు తదితరులు ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన వెంట దుడ్డు కొండయ్య, కటుమూరి బాబూరావు, పస్తం అప్పారావు, మోతీ గొరేశ్వరరావు తదితరులు ఉన్నారు.

భర్నికంలో మరో నలుగురికి డయేరియా



తహసీల్దార్ అంబేద్కర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో షేక్ ఆయేషా



గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న ప్రజారోగ్య సిబ్బంది



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్

పరవాడ: మండలంలోని భర్నికంలో బుధవారం మరో నలుగురికి డయేరియా సోకడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామంలో డయేరియా రోగుల సంఖ్య 12కు చేరింది. గ్రామానికి చెందిన ద్వారపూడి గంగరాజు(85), చింతా అప్పలనర్సమ్మ(76), బొండా ధనుశ్రీ(6), బొండా గంగాభవాని(8) మంగళవారం రాత్రి నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. వీరిని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. చిన్నారులకు ప్రథమ చికిత్స అనంతరం ఆరోగ్యం కుదుటపడడంతో ఇళ్లకు పంపించారు. మిగిలిన వృద్ధులకు ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. బుధవారం ఉదయం అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా గ్రామాన్ని సందర్శించి రోగుల తాజా ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. డయేరియా సోకడానికి గల కారణాలను తహసీల్దారు అంబేద్కర్, ఎంపీడీవో శ్యామ్‌సుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ముందుగా డయేరియా రోగుల్ని గుర్తించిన ప్రాంతంలో అక్కడి ప్రజలు తీసుకున్న ఆహారం, తాగునీటి వివరాలు సేకరించారు. పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించి కాలువలు శుభ్రం చేసి, అపరిశుభ్ర ప్రదేశాలు, మంచినీటి పథకాలు, చేతి పంపుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పారిశుధ్య నిర్వహణలో కొంకోట, అనకాపల్లి, పరవాడ, వాడచీపురుపల్లి పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

గ్రామ సమీపంలోని మొల్లోడి గెడ్డలో ఏళ్ల తరబడి నిలిచిన ఫార్మా వ్యర్థ రసాయన జలాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, మాజీ సర్పంచ్ బొండా తాతారావు, గ్రామ పెద్దలు పెదిశెట్టి సత్యారావు, దాట్ల గణేష్‌రాజు, బొండా నాని డిమాండ్ చేశారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ అంబేద్కర్ హామీ ఇచ్చారు. భర్నికంలో ప్రబలిన డయేరియాను అదుపు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

జగన్ జన్మదినోత్సవాన సేవా కార్యక్రమాలు



పార్టీ నేతలతో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 21న గ్రామాల్లో, వార్డుల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. రాంపురంలోని తన క్యాంప్ కార్యాలయలలో పార్టీ ముఖ్య నాయకులతో బుధవారం జరిగిన సమావేశంలో అధినేత జన్మదినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ అనాథలకు సేవలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, ముఖ్య నేతలు బోకం రామునాయుడు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, రాపర్తి మాధవరావు, మెంటి సూరిబాబు, గొరపల్లి శ్రీను, బొద్దపు చిన్నారావు, చిరికి దేముడు, నక్కా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు ద్రావణంతో పంట నష్టం నివారణ

- వర్షాల నేపథ్యంలో వరిచేను కోతలు వద్దు
- మండల వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్



పెందుర్తి: అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిసిన వర్షాలకు తడిచిన వరి చేనుపై ఉప్పు ద్రావణం చల్లడం ద్వారా చాలావరకు పంట నష్టాన్ని నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ పంట కోసిన తరువాత ఆరని వరి చేను పనలు కుప్పలు వేయాల్సిన పరిస్థితి ఉంటే ఎకరా చేనుకు 25 కిలోల కల్లు ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పలు వేసుకోవాలని సూచించారు. అదే కోత కోసిన తరువాత పంట పొలంపైనే ఉంచాల్సిన పరిస్థితి ఉంటే లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు ద్రావణాన్ని పనలు పూర్తిగా తడిచేలా పిచికారి చేసుకోవాలన్నారు. ఒకవేళ పొలంలో నీరు నిలిచి ఉన్న నేపథ్యంలో వరి పనలను పొలం గట్ల మీదకు తెచ్చుకుని విడదీసి ఉప్పుద్రావణం చల్లాలని పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పనలను ఆరబెట్టి నూర్పిడి చేయాలని సూచించారు. ఇటీవల కాలంలో నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టే పరిస్థితి లేకపోవడం వలన ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని, దీని నివారణకు క్వింటాల్ ధాన్యానికి కిలో కల్లు ఉప్పుతో 20 కిలోల పొడి ఊక కలిపి పోగు పెట్టడం వలన రంగు మారడాన్ని నివారించవచ్చన్నారు. రాబోయే రెండు మూడు రోజులు వర్షాలు పడే అవకాశాలున్న నేపథ్యంలో పొలాల్లో పక్వానికి వచ్చిన వరిచేను కోతలు నిలుపుదల చేయాలని సూచించారు.

వెంకన్నకు విశేష పూజలు



వెంకన్న సన్నిధిలో భక్తులు

పెందుర్తి: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుముర్రై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి నిర్వహించారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఉత్సవాలు ముగిసే వరకు భక్తుల కోసం కొండ దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం ఉంటుందని ఈవో వెల్లడించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠింపజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అయ్యప్పకు అభిషేకాలు



పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. పూర్ణ దేవి, పుష్కల దేవి, శాస్త, అయ్యప్పస్వామికి విశేష పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

'సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయండి'



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నేతలు ఉప్పాడ సత్యవతి, ప్రభావతి తదితరులు

సబ్బవరం: ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు నర్సీపట్నంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పార్టీ నాయకులు జెండాలు చేతపట్టి, మండల కేంద్రంలోని పలు షాపులకు వెళ్లి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బి.ప్రభావతి, కె.కోటేశ్వరరావు, పి.కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఉద్యోగి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు



రాంబిల్లి పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు, సీపీఎం నేతలు

రాంబిల్లి/పరవాడ: నేవల్ బేస్ ప్రాజెక్ట్ ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో విద్యుత్ షాక్‌తో దొరాజియా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఉద్యోగి మరణించాడు. రాంబిల్లి సీఐ నర్సింగరావు, మృతుని బంధువులు తెలిపిన వివరాలు....

పరవాడకు చెందిన బండారు నీలబాబు(39) దొరాజియా కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఫ్లోర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. రాంబిల్లి నేవీ కాలనీ సమీపంలో నేవల్‌బేస్ రక్షణ గోడ నిర్మాణ పనుల్లో బుధవారం ఐరన్ టేపుతో కొలతలు తీస్తుండగా ఆ ఐరన్‌టేపు, పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై ఘటనా స్థలంలో కుప్పకూలిపోయాడు. తోటి ఉద్యోగులు హుటాహుటిన రాంబిల్లి పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే నీలబాబు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. నీలబాబు మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి వద్ద గుండెలవిసేలా విలపించారు. పరవాడలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఆస్పత్రి వద్ద ఆందోళన

మృతి చెందిన నీలబాబుకు కంపెనీ యాజమాన్యం నష్ట పరిహారం అందజేసి, ఆదుకోవాలని మృతుని బంధువులు, సీఐటీయూ నేతలు రాంబిల్లి పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేశారు. నష్టపరిహారం చెల్లించనిదే మృతదేహాన్ని పోస్టుమార్టంనకు తరలించనివ్వబోమని భీష్మించుకు కూర్చుకున్నారు. నష్టపరిహారం చెల్లించేందుకు ఎట్టకేలకు బుధవారం రాత్రి కంపెనీ యాజమాన్యం హామీ ఇచ్చింది. దీంతో మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. ఈ ఘటనపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేసినట్టు సీఐ చెప్పారు.

దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గ్రామ రెవెన్యూ సదస్సుల్లో అధికారులు



ఏపీఐఐసీ భూముల ఆక్రమణపై ఎస్‌డీసీకి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ గోవింద, నాయకులు



అంతకాపల్లిలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, తదితరులు

పెందుర్తి: సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ప్రత్యేకాధికారి సీతారామారావు అన్నారు. గుర్రంపాలెంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. రెవెన్యూ యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సకాలంలో మ్యుటేషన్, ఆన్‌లైన్ ప్రక్రియ, ఇతరత్రా అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. గుర్రంపాలెంలోని ఏపీఐఐసీ ద్వారా ప్రైవేట్ కంపెనీలకు కేటాయించిన భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానిక సర్పంచ్ ఉగ్గిన గోవింద, నాయకులు ఫిర్యాదు చేశారు. కంపెనీలకు కేటాయించిన భూముల్లో కాకుండా సరిహద్దులు దాటి వచ్చి శాశ్వత నిర్మాణాలను కంపెనీలు చేపడుతున్నాయని.. తక్షణమే ఆ సంస్థలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సబ్బవరం: రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందించిన అర్జీలను పరిశీలించి, సకాలంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఆయా పరిధిలోని రైతులు తమ సమస్యలను నివేదించి, పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. అంతకాపల్లిలో 660 సర్వే నెంబర్లలో 3,115.75 ఎకరాల మొత్తం భూమి ఉండగా, ఇందులో 1,148 ఎకరాల ప్రభుత్వ , 1,967.19 ఎకరాల జిరాయితీ భూమి ఉందన్నారు. రైతుల నుంచి 8 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. సదస్సులో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, రీ సర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ లాలం అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వో రుక్మిణి, విలేజ్ సర్వేయర్లు ఇందిర, కృష్ణ, లోకేష్, గ్రామ పెద్దలు మిడతాడ మహాలక్ష్మినాయుడు, సబ్బవరపు దేముడుబాబు, పి.రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పది కిలోల హాష్ ఆయిల్ పట్టివేత

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గవర జగ్గయ్యపాలెంలో నిల్వ ఉంచిన హాష్ ఆయిల్(లిక్విడ్ గంజాయి)ను పెందుర్తి పోలీసులు, నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం భీమలాపల్లికి చెందిన ఉలంగి రామన్న, పాడేరుకు చెందిన కూడా రవిశంకర్, జీకే వీధి మండలం వంచుల చీరపల్లి గ్రామానికి చెందిన బోనంగి చంటిబాబులు కలిసి హాష్ ఆయిల్ సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో ఏజెన్సీ నుంచి నగరానికి 10 కిలోల హాష్ ఆయిల్‌ను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పెందుర్తి పోలీసులు పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.